- హైస్కూల్ ప్లస్‌లో ఉపాధ్యాయుల కొరత
- ఆరు నెల నుంచి పాఠాలు చెప్పే వారు లేక విద్యార్థుల అయోమయం
- ఎస్‌జీటీలతో హైస్కూల్ ప్లస్ బోధనపై విమర్శలు
- బోధించలేమని చేతులు ఎత్తేస్తున్న ఉపాధ్యాయులు
- విద్యార్థుల భవిష్యత్ నాశనం చేస్తున్న ప్రభుత్వం


డీఈఓ దృష్టికి ఉపాధ్యాయుల విషయాన్ని తీసుకువెళుతున్న ఎంఈఓ, ప్రిన్సిపాల్(ఫైల్)

విద్యార్థుల జీవితాలతో ఆటలా..?

కొత్తపట్నం: కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటుంది. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లో ప్రభుత్వ విద్య రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ విప్లవాత్మక మార్పులన్నింటినీ రద్దు చేసింది. దీనికి ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మారింది.

పాఠాలు చెప్పే వారేరి.?

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మండలంలో ఒక హైస్కూల్‌ను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియెట్ విద్య ప్రవేశపెట్టింది. అయితే ప్రభుత్వ పాఠశాలల నిర్వీర్యానికి కంకణం కట్టుకున్న కూటమి ప్రభుత్వం ఇంత వరకు హైస్కూల్ ప్లస్‌లలో ఉపాధ్యాయులను నియమించలేదు. దీంతో పాఠశాలలు ప్రారంభమై ఆరు నెలలైనా పాఠాలు చెప్పే వారు లేకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రమైన కొత్తపట్నంలో బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024 విద్యా సంవత్సరానికి హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థినీ, విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుకోవడానికి అవకాశం కల్పించింది. అయితే వారికి సబ్జెక్టులకు బోధనకు మాత్రం ప్రత్యేకంగా లెక్చరర్లను నియమించలేదు. దీంతో ఎస్‌జీటీలు, సర్‌ప్లస్‌లో ఉన్న స్కూల్ అసిస్టెంట్లతో నామమాత్రంగా బోధిస్తున్నారు. అయితే వారికి సబ్జెక్టుపై అంతగా అవగాహన లేకపోవడంతో విద్యార్థులకు తలనొప్పిగా మారింది.

విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన..

మండలంలో ఆరు హైస్కూల్స్ ఉన్నాయి. ఈ హైస్కూల్స్ నుంచి ఏటా 550 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్‌కు వెళుతుంటారు. అయితే దూర ప్రాంతాలకు వెళ్ల లేక, ఆర్థిక స్తోమత సక్రమంగా లేక కొంత మంది పదో తరగతిలోనే మానుకుంటున్నారు. ఈ క్రమంలో హైస్కూళ్లలోనే ఇంటర్మీడియెట్ ప్రవేశపెట్టడంతో విద్యార్థులు ఎంతో సంతోషించారు. కానీ వారు ఆనందం ఎక్కువ రోజులు నిలవలేదు. కొత్తపట్నంలో హైస్కూల్‌ప్లస్‌ను ప్రారంభించారు. సెక్షన్‌కు 40 మంది విద్యార్థుల చొప్పున ఎంపీసీ, సీఈసీలను ఈ ఏడాది 2024లో మంజూరు చేసింది. ప్రస్తుతం ఒక్కో గ్రూపులో 24 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ గ్రూపుల్లో పాఠాలు బోధించేందుకు ఆగస్టు 1 నుంచి ప్రభుత్వం వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద సర్‌ప్లస్‌లో ఉన్న ఎస్‌ఏలను, ఎస్జీటీ ఉపాధ్యాయులను 8 మందిని ఆగస్టు ఒకటిన విధుల్లో చేరాలని అప్పటి విద్యాశాఖాధికారి డి.సుభద్ర ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ఉత్తర్వుల మేరకు తెలుగు, ఫిజిక్స్, సివిక్స్, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టు ఉపాధ్యాయులు మాత్రమే విధుల్లో చేరి పాఠాలు బోధిస్తున్నారు. మిగిలిన ఎకనామిక్స్, కామర్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు బోధించాల్సిన ఎస్టీటీలు మాత్రం చేరలేదు. ఉన్నత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి అడిగి వెళుతున్నారు. దీంతో విద్యార్థులకు సిలబస్ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇటీవల డీఈఓగా బాధ్యతలు స్వీకరించిన కిరణ్‌కుమార్ అక్టోబర్‌లో హైస్కూల్‌ను తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీదేవి మూడు సబ్జెక్ట్‌లు ఉపాధ్యాయులు చేరలేదని, పరీక్షలు గడువు దగ్గరకు వస్తున్నాయని, ఉపాధ్యాయులను నియమించాలని డీఈఓ దృష్టికి తీసికెళ్లారు. స్పందించిన డీఈఓ..వెంటనే ఎంఈఓకు ఫోన్ చేసి ఉపాధ్యాయులను అక్కడ నుంచి రిలీవ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమం గత నెల 24న హైస్కూల్ ప్లస్‌లో చేరారు. మరో ఉపాధ్యాయుడు మాత్రం ఇంత వరకు చేరలేదు.


కొత్తపట్నంలో హైస్కూల్ ప్లస్ స్కూల్

వర్క్ అడ్జస్ట్‌మెంట్ పట్ల ఉపాధ్యాయుల ఆందోళన

ఎస్‌జీటీ ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద ఉపయోగించడం సరైన పద్ధతి కాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం సబ్జెక్టులను చెప్పడం కూడా కష్టసాధ్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చెందుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పీజీటీలను నియమించి నెలకు రూ.2,500 అదనంగా పారితోషికం చెల్లించింది. కానీ కూటమి ప్రభుత్వం ఎలాంటి పారితోషికం లేకుండా హైస్కూల్ ప్లస్‌కు ఉపాధ్యాయులను రిలీవ్ చేయించి బోధిన చేయడం సరైన పద్ధతి కాదని వారు మండిపడుతున్నారు. పదోన్నతులు లేకుండా పారితోషికం ఇవ్వకుండా ఎస్‌జీలను, సర్‌ప్లస్‌లో ఉన్న స్కూల్ అసిస్టెంట్లను ఈ విధంగా సర్దుబాటు చేయడం పట్ల ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో నాలుగు నెలల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కానీ ఇంత వరకు సిలబస్ ప్రారంభించని సబ్జెక్టులు ఉన్నాయి. ఈ నాలుగు నెలల్లో సిలబస్ ఎలా పూర్తి చేస్తారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి లెక్చరర్లను నియమించి వీలైనంత త్వరగా సిలబస్ పూర్తి చేసేలా చూడాలని కోరుతున్నారు.

పరీక్షలు ఎలా రాయాలి



ఇంత వరకు ఎకనామిక్స్ సబ్జెక్టు సిలబస్ ప్రారంభించలేదు. అసలు ఆ ఉపాధ్యాయులే ఇంత వరకు రాలేదు. మరో మూడు నెలల్లో పరీక్షలు ప్రారంభమవుతాయి. ఆ పరీక్షలు ఎలా రాయాలో అర్థం కావడం లేదు. తరగతులు ప్రారంభమై ఆరు నెలలు దాటినా ఇంత వరకు ఉపాధ్యాయులను నియమించకపోవడం దారుణం. ఎకనామిక్స్ సబ్జెక్టు ఉపాధ్యాయుడిని వెంటనే నియమించాలి.

– గొల్లపోతు సాయిచంద్, సీఈసీ, ఇంటర్మీడియెట్

ప్రత్యేక తరగతులు నిర్వహించాలి



ఇప్పటికే ఉపాధ్యాయులు కొరతతో పాఠ్యాంశాల్లో బాగా వెనుకబడి ఉన్నాం. ప్రత్యేక తరగతులు నిర్వహించి సిలబస్ పూర్తి చేయాలి. మార్చిలో జరిగే పరీక్షల్లో మంచి మార్కులతో అందరూ ఉత్తీర్ణులయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కొక్కిలగడ్డ పూర్ణ వెంకటేష్, సీఈసీ

అధికారులు స్పందించాలి



ఇంత వరకు సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించపోవడం ఏంటో అర్థం కావడం లేదు. అధికారులు మా గురించి పట్టించుకోవడం లేదు. దీంతో మా భవిష్యత్ అంధకారంలో ఉంది. ఇప్పటి వరకు సిలబస్ ప్రారంభించకుంటే ఎప్పుడు పూర్తి చేస్తారు, ఎప్పుడు మేం చదువుకోవాలో అర్థం కావడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

– దండిప్రోలు రామ్‌చరణ్, సీఈసీ

మెరుగైన ఫలితాలు సాధించాలి

- మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ ఘనంగా నిర్వహించాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా


మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచి మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి సోమవారం మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. విద్యారంగంలో మంచి ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7వ తేదీ చేపట్టే మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ కార్యక్రమాలను జిల్లాలో పండుగ వాతావరణంలో నిర్వహించేలా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా పాఠశాలల్లో చదివి ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులను కూడా కార్యక్రమాలకు ఆహ్వానించాలన్నారు. రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం కింద విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. మెనూ ప్రకారం పెట్టే భోజనానికి అదనంగా మరో మూడు రుచికరమైన ప్రత్యేక వంటలను కార్యక్రమం రోజు విద్యార్థులకు పెట్టాలన్నారు. విద్యార్థులకు అపార్ ఐడీ జనరేట్ చేసే క్రమంలో ఎదురయ్యే ఆధార్‌కార్డు సవరణ సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రతి ఇంటినీ ఫొటో తీసి జియో ట్యాగింగ్ చేయాలన్నారు. అందరి బ్యాంకు ఖాతాలను ఎన్‌పీసీఐతో మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఎనర్జీ అసిస్టెంట్‌లో సహా సచివాలయం ఉద్యోగులంతా బయోమెట్రిక్ హాజరు కచ్చింతా వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధిహామీ పథకంలో కూలీలకు పనిదినాల కల్పనలో లక్ష్యాన్ని చేరుకునేలా చూడాలని సూచించారు. మినీ గోకులం షెడ్లులు, ఫారమ్ పాండ్స్, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ పనులు వేగవంతం చేయాలన్నారు. దీనిలో డీపీఓ వెంకటనాయుడు, డీఈఓ కిరణ్‌కుమార్, సీపీవో వెంకటేశ్వర్లు, పరిశ్రమల జీఎం శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, మైన్స్ డీడీ రాజశేఖర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

హెల్ప్ సాగర్‌కు అవార్డు


అవార్డు అందుకున్న బీవీ సాగర్, సిబ్బంది

ఒంగోలు సబర్బన్: హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలకు మూడు నెలల పాటు అవగాహన కల్పించినందుకు గాను హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఒంగోలు ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్‌కు అవార్డు బహూకరించారు. బాపట్లలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాపట్ల సీనియర్ సివిల్ జడ్జి వాణి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, షీల్డు అందుకున్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ దినం పురస్కరించుకుని బాపట్లలో నిర్వహించిన కార్యక్రమంలో బీవీ సాగర్ బృందానికి అవార్డు అందజేశారు. ఉమ్మడిప్రకాశం జిల్లాలో హెల్ప్ టీఐ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన, నియంత్రణ -2017 చట్టంపై గత మూడు నెలలుగా మీకు తెలుసా ఐఈసీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. హెచ్ఐవీ ఎయిడ్స్ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఒంగోలు ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ సాగర్‌తో పాటు అవుట్‌రీచ్ వర్కర్ ఎం.మల్లేశ్వరిలు ఈ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా వైదా డాక్టర్ జయమ్మ, హెల్ప్ పీఈలు ఎం దివ్య, నాగలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.





భక్తిశ్రద్ధలతో పోలిస్వర్గం



ఒంగోలు మెట్రో: పోలి స్వర్గం పర్వదినాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కేశవస్వామిపేటలో ప్రసన్న కాశీ విశ్వనాథుని దేవస్థానం కోనేరు ప్రాంగణం భక్తులతో దీపాలతో కళకళలాడింది. ఈ సందర్భంగా దేవస్థానం కోనేరులో విశేషంగా మహిళలు పాల్గొని అరటిదొప్పలలో వత్తులు వెలిగించి భక్తిశ్రద్ధల నడుమ కోనేరు నీటిలో దీపాలు వదిలారు. పోలి స్వర్గం రోజన దీపాలు వెలిగించి, నీటిలో వదిలితే కార్తీక మాసం నెల రోజులు దీపారాధన చేసిన పుణ్యం కలుగుతుందని, శివపురాణం ప్రామాణికంగా తీసుకున్న భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలను నీటిలో వదిలారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దేవస్థాన కార్యనిర్వహణాధికారి శివశంకర్, సిబ్బంది ఏర్పాట్లను చేశారు.







హింసకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలి

సంతనూతలపాడు: సమాజంలో మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఐద్వా మండల కార్యదర్శి ఎస్ మాలతి పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతున్న హింస అత్యాచారాలను అరికట్టాలని ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో మహిళలతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలతి మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో మహిళలపై చిన్నారులపై జరుగుతున్న ఘోరాల వలన క్రైమ్ రేటు విపరీతంగా పెరిగిపోతోందన్నారు. దేశంలో ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో ప్రతి నిమిషం ఒక అఘాయిత్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం మద్యం, మత్తు పదార్థాలకు నిలయంగా మారిందని అన్నారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఐద్వా నాయకురాలు కే బుజ్జి అధ్యక్షత వహించగా నాయకులు ఎస్ కే నాగూర్ బీ, కే లక్ష్మి, ఎస్ మేఘన తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి


బసవన్నపాలెం సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ వీ జ్యోతి

మద్దిపాడు: మండలంలోని అన్ని సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ వీ జ్యోతి అన్నారు. మండలంలోని బసవన్నపాలెం, పెదకొత్తపల్లి సచివాలయాలను సోమవారం ఆమె పరిశీలించారు. బసవన్నపాలెం సచివాలయానికి వెళ్లిన క్రమంలో అక్కడ ఇద్దరు ముగ్గురు మాత్రమే సిబ్బంది ఉన్నారు. దీంతో సచివాలయ సిబ్బంది సమయానికి రావాలని, లేకుంటే వారికి జీతంలో కోత విధిస్తామని హెచ్చరించారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలను తప్పని సరిగా పాటించాలని, ఎవరికీ మినహాయింపులు లేవని ఆమె స్పష్టం చేశారు.

రెండు గ్రానైట్ ట్రాలీలు ఢీ

చీమకుర్తి: ఒకదాని వెనుక ఒకటి వెళ్తున్న రెండు గ్రానైట్ ట్రాలీలు ఢీకొన్నాయి. సోమవారం సాయంత్రం చీమకుర్తి తూర్పు బైపాస్‌లో ఈ సంఘటన జరిగింది. రామతీర్థంలోని గ్రానైట్ క్వారీ నుంచి గ్రానైట్ రాళ్లను లోడు చేసుకొని ఒంగోలు వైపు వెళ్తున్న రెండు ట్రాలీలు బైపాస్ వద్దకు వెళ్లేసరికి ముందు వెళ్తున్న లారీని ఆపటంతో వెనుక వస్తున్న ట్రాలీకి బ్రేకులు పడక వెనుక ఉన్న ట్రాలీ ముందు ఉన్న ట్రాలీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక ఉన్న ట్రాలీ ఇంజన్ భాగం స్వల్పంగా దెబ్బతింది. కానీ రెండు వాహనాల్లో ఎవరికీ ప్రాణ హాని జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ప్రమాదం జరిగిన సంఘటనను పరిశీలించి విచారిస్తున్నారు.


దెబ్బతిన్న గ్రానైట్ ట్రాలీ

కార్యకర్తను పరామర్శించిన బూచేపల్లి


శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న డాక్టర్ శివప్రసాదరెడ్డి

దర్శి: మండలంలోని త్రిపురసుందరీపురం గ్రామానికి చెందిన సంగన శ్రీనివాసరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందాడు. తిరిగి ఇంటికి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్త సంగన శ్రీనివాసరెడ్డిని దర్శి శాసనసభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి శ్రీనివాసరెడ్డిని సోమవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. శ్రీనివాసరెడ్డికి ధైర్యం చెప్పారు.